ఇంకెన్నాళ్లు రేషన్ కష్టాలు?

- 27 గ్రామ పంచాయతీల్లో 23 రేషన్ షాపులు
- పట్టింపులేని పాలకులు, అధికారులు


ఉప్పునుంతలలో రేషన్ బియ్యం తీసుకుంటున్న వినియోగదారులు

ఉప్పునుంతల: ప్రభుత్వాలు మారుతున్నా గ్రామీణులకు రేషన్ కష్టాలు తప్పడం లేదు. రేషన్‌బియ్యం కోసం నెలనెలా కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో రేషన్‌దుకాణాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో స్థానికంగా రేషన్ దుకాణాలు లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెలా కిలోమీటర్లమేర దూరం కాలినడకన, వాహనాలపై పొరుగు గ్రామాలకు వెళ్లి రేషన్ సరకులు తీసుకొస్తున్నారు. రేషన్ బియ్యం విలువ కంటే ఆటో చార్జీలే అధికం అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు, 38 ఆవాస గ్రామాలుండగా ప్రస్తుతం 23 రేషన్‌షాపులు మాత్రమే ఉన్నాయి. 9724 రేషన్ కార్డుదారులు ఉన్నారు. వాటిలో పెద్ద గ్రామ పంచాయతీలుగా ఉన్న ఉప్పునుంతల, తాడూరు, వెల్టూర్, పెనిమిళ్ల, కాంసానిపల్లి లో రెండేసి రేషన్ షాపుల చొప్పున పది షాపులు ఏర్పాటు చేశారు. మిగిలిన 22 గ్రామ పంచాయతీల పరిధిలో కేవలం 13 రేషన్ షాపులు మాత్రమే ఉన్నాయి.

పొరుగు గ్రామాలకు వెళ్లాల్సిందే..

కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపులు అందుబాటులో లేవు. పొరుగున ఉన్న గ్రామ పంచాయతీలకు వెళ్లి రేషన్ బియ్యం తీసుకొస్తున్నామని వినియోగదారులు పేర్కొన్నారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామ పంచాయతీతో పాటు పంచాయతీ పరిధిలోని తిప్పాపూర్ తండాడాలకు చెందిన వినియోదారులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడూరు వెళ్లి రేషన్ సరకులు తెచ్చుకుంటున్నారు. అదేవిధంగా మొల్గర గ్రామ పంచాయతీకి చెందిన వినియోగదారులు పెద్దాపూర్‌కు వెళ్లి సరకులు తెచ్చుకోవల్సిన దస్థితి నెలకొంది. రంగంపేట, కొత్తరాంనగర్ గట్టుకాడిపల్లికి చెందిన గ్రామాల వినియోగదారులు ప్రతినెలా మండల కేంద్రానికి వెళ్లక తప్పడం లేదు. ఈరట్యానిపల్లి, లత్తీపూర్ రెండు గ్రామ పంచాయతీలకు చెందిన రేషన్ వినియోగదారులు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గువ్వలోనిపల్లి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సీబీ తండా, పూర్యానాయక్ తండా గ్రామ పంచాయతీల ప్రజలు పెనిమిళ్లకు వెళ్లాల్సిందే. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కనీసం గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపులు ఏర్పాటుచేసి స్థానికంగానే సరకులు అందజేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

కొత్త గ్రామ పంచాయతీల్లో రేషన్‌దుకాణాల ఏర్పాటుకు కృషి చేస్తాం. ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తాం. వినియోగదారుల విన్నపం మేరకు ప్రతిపాదనలు పంపిస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తాం

–సరస్వతి, డిప్యూటీ తహసీల్దార్

మూడు కిలోమీటర్ల దూరంలో



ప్రతి నెలా మండల కేంద్రానికి వెళ్లి రేషన్ బియ్యం తీసుకొస్తున్నాం. గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరం పోకతప్పడం లేదు. నాలుగేళ్ల కిందట గ్రామంలోనే రేషన్ బియ్యం ఇచ్చేవారు. రేషన్ బియ్యం కోసం వెళ్లిన రోజు పూర్తిగా వ్యవసాయ పనులు మానుకోవల్సి వస్తోంది. అధికారులకు సమస్య తెలిసినా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలోనే రేషన్‌షాపు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– బొల్లు పార్వతమ్మ, గట్టుకాడిపల్లి

క్లుప్తంగా

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

తెలకపల్లి: సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల గడువును 20వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11 గంటలకు ఉంటుందని వివరించారు. అదేవిధంగా గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకునేందు అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

కొనసాగుతున్న నిరంజన్ షావలీ ఉత్సవాలు



మన్ననూర్: మత సామరస్యానికి ప్రతీకగా ప్రతి ఏటా నిర్వహించే నిరంజన్ షావలీ(జాతర) ఉత్సవాలు స్థానిక తలుపుల కురువ వద్ద రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు దర్గాను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. పలు మిఠాయి దుకాణాలు, పిల్లల ఆటవస్తువల దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడాయి.

ఆలయ అభివృద్ధికి విరాళాల అందజేత



వెల్దండ: మండలంలోని కొట్రలో నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వర స్వామి ఆలయం కోసం దాతలు శుక్రవారం రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన గట్టు తిరుపతయ్యగౌడు రూ.10 వేలు, బాలరాజు రూ.5వేలు చొప్పున విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడ్, నాయకులు వెంకటయ్యగౌడ్, నాగేష్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, అశోక్‌గౌడ్, గట్టు వెంకటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో యూరియా



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పీఏసీఎస్ గోదాంలో 1000 బస్తాల యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, కొత్త పాస్ పుస్తకం జిరాక్స్‌లు తప్పనిసరిగా తీసుకొని రావాలని కోరారు. ఒక బస్తాకు రూ.267లు చెల్లించాలని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ శ్యాం, డైరెక్టర్లు రాము నాయక్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

22న సెలవు దినంగా ప్రకటించాలి



అచ్చంపేట రూరల్: అయోధ్య రాముడి ప్రాణ:ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22వ తేదీన సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ రామారావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. సుమారు 500 సంవత్సరాల నుంచి భారత ప్రజలు ఎదురుచూస్తున్నారని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని విన్నవించారు. కార్యక్రమంలో తపస్ నాయకులు అరవిందరావు, జగదీశ్వర్, రమేష్, రాంగోపాల్ గౌడ్, గోవర్ధన్, నాచ, రమేష్ రాథోడ్, సతీష్ కుమార్, ఆంజనేయులు, రాజేష్, రమేష్, లోకేష్, మహేష్ పాల్గొన్నారు.

అక్షరవనంలో విద్యాబోధన ఆదర్శం


విద్యార్థినులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే

కల్వకుర్తిరూరల్: అక్షరవనంలో విద్యార్థులకు వినూత్నంగా బోధించే తీరు స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని అక్షరవనాన్ని కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ వినూత్న బోధనతో విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి మెరుగవుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థుల విద్యా సామర్థాలను అడిగి తెలుసుకున్నారు. అక్షరవనంలో బోధనాపద్ధతులు ఇతర పాఠశాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు నేర్పే విధానం బాగుందని ప్రశంసించారు. భవిష్యత్ తరాలకు అక్షరవనం విద్యకు పరిశోధన కేంద్రంగా మారుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్వాహకులు శ్రీపతిరెడ్డి, విద్యార్థులు ఉన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై గ్రామసభలు


హాజరైన అధికారులు, గ్రామస్తులు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా చెదురుపల్లి, పోషమ్మగడ్డతండా, బొల్లంపల్లి, పెద్దాపూర్ మొత్తం గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలను ఏర్పాటు చేశారు. 2024–2025 సంవత్సరానికి సంబంధించి గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రణాళికలను అధికారులు వివరించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి లైట్లు, తదితర వాటికి ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈనెల 27న అభివృద్ధి పనులను గుర్తిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

వ్యవసాయ పరికరాలు పంపిణీ


మాట్లాడుతున్న ప్రాజెక్ట్ మేనేజర్ రజనీకాంత్

అమ్రాబాద్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సంఘాలకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ రజనీకాంత్ మాట్లాడుతూ 70 శాతం సంస్థ, 30 శాతం మహిళా సంఘాలు ఖర్చు భరిస్తుందన్నారు. మొత్తం 13 మహిళా సంఘాలకు రూ.42 లక్షల విలువ చేసే ఏడు రోటోవేటర్, మూడు మల్టీ క్రషర్స్, రెండు సీడ్ డ్రిల్, 10 గన్‌పంపుల పరికరాలు అందజేశామన్నారు. మహిళ ఆర్థిక స్వాలంబన సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత


బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తాడూరు: తొలి తెలుగు కథారచయిత్రి అచ్చమాంబ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని అల్లాపూర్ పాఠశాలలో క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా యోగి వేమన జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. యోగి వేమన, రచయిత్రి అచ్చమాంబ జీవిత చరిత్రను విద్యార్థులకు ఉపాధ్యయులు వివరించారు. ఝాన్సీరెడ్డి ఆర్థిక సహాయ సహకారాలతో విద్యార్థులకు వివిధ రకాల బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్, హెచ్‌ఎం కట్టా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మహిళా సమాఖ్య భవనం


శిథిలావస్థకు చేరుకున్న మహిళా సమాఖ్య భవనం


డ్వాక్రా భవనం ఇలా..

తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ భవనాల ఆవరణలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మహిళా సమాఖ్య భవనం నిర్వాహణ సక్రమంగా లేక శిథిలావస్థకు చేరుకుంది. గతంలో మహిళా సమాఖ్యకు సంబంధించి మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెల సమావేశాలు నిర్వహించేవారు. దీంతో పాటు అనుసరించుకుని ఉన్న డ్వాక్రా భవనం కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ సముదాయ భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి సమాఖ్య భవనానికి, డ్వాక్రా భవనానికి మరమ్మతు చేపట్టి వినియోగం తీసుకురావాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

రాష్ట్ర అభివృద్ధే సీఎం లక్ష్యం

కందనూలు: రాష్ట్ర అభివృద్ధే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మొదటిసారి అమెరికా పర్యటనలో భాగంగా రూ.3700 కోట్లు పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చారని వివరించారు. ఇప్పటికే రెండు హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుల అసత్య ప్రచారాలు నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నాయకుల పరామర్శ



కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి శుక్రవారం ఆస్రత్రిలో రమేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట అనిల్ గౌడ్, వాసుదేవా రెడ్డి తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ వితరణ



బల్మూర్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1986–87 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శుక్రవారం కంప్యూటర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాంసింగ్ పూర్వ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించడం కోసం ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మూతబడిన ఉర్దూమీడియం పాఠశాల


జటప్రోలులో ఉర్దూమీడియం పాఠశాలకు తాళం వేసిన అధికారులు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలులో రెండేళ్ల కిందట ఉర్దూ మీడియం పాఠశాలను మూసివేశారు. 2012 సంవత్సరంలో ముస్లిం విద్యార్థులకు విద్యా బోధన అందించేందేకు ఉర్దూ పాఠశాలను ఏర్పాటు చేశారు. దాదాపుగా పదేళ్లపాటు సక్రమంగా తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సక్రమంగా విద్యా బోధన చేయడం లేదని కారణంగా గ్రామంలో ఉన్న ఉర్దూ పాఠశాలను మూసివేయించారు. ఉర్దూ మీడియం ఉపాధ్యాయురాలికి ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేశారు. విద్యార్థులను ఇతర పాఠశాలకు తల్లిదండ్రులు పంపిస్తున్నారు. ఇప్పటికైనా ఉర్దూమీడియం పాఠశాలను పునఃప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఓటరు నమోదును వినియోగించుకోవాలి


చారకొండలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రమీల

చారకొండ: ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోవాలని తహసీల్దార్ ప్రమీల కోరారు. శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శని, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు చేపడుతునట్లు పేర్కొన్నారు. మండలంలోని రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కోసం 21 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరి, అధికారులు, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ హిమబిందు అన్నారు. 20, 21వ తేదీన ఆయా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఓటరుగా నమోదు, తప్పొప్పులకు అవకాశం ఉందన్నారు.

రైతాంగ కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం


మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ రూరల్: దేశంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల హక్కుల పరిరక్షణకు పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 1982 జనవరి 19న తమిళనాడులో కార్మికులు సాధారణ సమ్మె నిర్వహించిన సందర్భంగా రైతులకు కనీస మద్దతు ధరలు కావాలని, వ్యవసాయ కార్మికులకు గౌరవప్రదమైన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె ఆ రాష్ట్రంలో విజయవంతమైందని అన్నారు. తమిళనాడులోని డెమోక్రటిక్ సోషలిస్టు పార్టీ, ఫార్వర్డ్‌బ్లాక్, సీపీఐ, సీపీఎం, జనతా లోక్‌దల్, జన్‌వాదీ పార్టీలు సమష్టిగా సంతకాలు చేస్తూ.. సాధారణ సమ్మెకు మద్దతు ప్రకటించాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 13 యోజన విద్యార్థి సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయని తెలియజేశారు. సమ్మె సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు వ్యవసాయ కార్మికులు చనిపోయారని, ఆనాటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా జనవరి 19న కార్మికుల కర్షకుల ఐక్య దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సి.బాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి ఎం.రమేష్, కమిటీ సభ్యులు వెంకటేష్, బాలరాజు, పర్వతాలు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కాషాయ జెండాల అందజేత


కల్వకుర్తిలో కాషాయ జెండాలను అందిస్తున్న వ్యాపారవేత్త రాంభూపాల్ రెడ్డి


లింగాల మండలం అప్పాయపల్లిలో

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో హిందూ సంఘాల వినతిమేరకు వ్యాపారవేత్త రాంభూపాల్‌రెడ్డి శ్రీరాముడి చిత్రపటంతో ముద్రించిన 516 కాషాయ జెండాలను శుక్రవారం నాయకులకు అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో భవ్యమైన శ్రీరామమందిరం ప్రారంభం కానున్న సందర్భంగా జెండాలను ఇళ్లపై ఎగురవేయాలని కోరారు. దుర్గా ప్రసాద్, వివేకానంద, ఆంజనేయులు, దయాకర్, నర్సిరెడ్డి, బాబీదేవ్, దామోదర్, అశోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు సతీశ్వరం సమక్షంలో అయోధ్య రాముడి ఫొటోతో కూడిన జెండాలను పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో రాముడి ప్రాణఃప్రతిష్ఠ పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తుల్సిరాం, బాలరాజు, రేణ్యానాయక్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

అతివేగాన్ని నియంత్రించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొల్లాపూర్: పట్టణంలో వాహనదారుల అతివేగాన్ని నియంత్రించాలని కోరుతూ మాలల చైతన్య సమితి, యూత్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పోలీసులకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో యువకులు మద్యం మత్తులో ట్రిపుల్ రైడింగ్ చేస్తూ, ఓవర్ స్పీడుతో వెళ్తున్నారని వివరించారు. దీంతో రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వాహనాల వేగాన్ని నియంత్రణకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో మాలల చైతన్య సమితి మండల అధ్యక్షుడు బిజ్జ సురేందర్, పట్టణ అధ్యక్షుడు సందీప్, మద్దెల వెంకట్రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు గోపాల్, బాబా, గౌరమోని శేఖర్ తదితరులున్నారు.


గుండెపోటుతో పీఈటీ మృతి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్, పీఈటీ దుర్గం కృష్ణప్రసాద్‌గౌడ్(58) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం పీఈటీ కృష్ణప్రసాద్ గుండెనొప్పి వస్తుందని కుటుంబసభ్యులకు తెలపగా వెంటనే అతడిని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కృష్ణప్రసాద్‌గౌడ్ నాగర్‌కర్నూల్ డీఈఓ కార్యాలయంలో స్టూడెంట్ పోలీస్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య రజినితో పాటు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

సుధాకర్‌రావు నియామకంపై హర్షం

పాన్‌గల్: బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఎల్లేని సుధాకర్‌రావు రెండోసారి నియామకంపై నియోజకవర్గ బీజేపీ నాయకులు అన్వేష్, రమేష్ మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజునాయుడు, వెంకటేష్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధుడు అదృశ్యం: కేసు నమోదు


చంద్రయ్య

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన శ్యాంపూరి చంద్రయ్య(60) ఈనెల 3వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 15 రోజులు దాటినా ఎంతకీ ఇంటికి తిరిగిరాకపోవడంతో వృద్ధుడి కుమారుడు చెన్నయ్య శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

టిప్పర్ బోల్తా: డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని బోడబండ తండా సమీపంలో మట్టి తరలిస్తున్న ఓ కంపెనీ చెందిన టిప్పర్ శుక్రవారం అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల వివరాల ప్రకారం పాలమూరు ప్రాజెక్టులో భాగంగా అంజనగిరి రిజర్వాయర్ పనులకు ఓ టిప్పర్‌ను వినియోగిస్తున్నారు. మట్టి తరలిస్తుండగా వాహనం అదుపుతప్పి డ్రైవర్ పవన్ పాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం డ్రైవర్‌ను సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.